# బీఆర్ఎస్ నేతలపై ఆగని కాంగ్రెస్ దాడులు

- ఓటమి భయంతో రెచ్చిపోతున్న ఆ పార్టీ నాయకులు, శ్రేణులు
- కొల్లాపూర్‌లో బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ వాహనంపై దాడి
- ఘటనా స్థలికి వెళ్తున్న పోలీస్ వాహనం ధ్వంసం
- సీఐకి తప్పిన ప్రమాదం
- నకిరేకల్‌లో బీఆర్ఎస్ ప్రచార రథంపై దాడి

కొల్లాపూర్/నకిరేకల్, నవంబర్ 24 : కాంగ్రెస్ నాయకులకు ఓటమి భయం పట్టుకున్నది. దీన్ని జీర్ణించుకోలేని సదరు నాయకులు తమ శ్రేణులను రెచ్చగొట్టి బీఆర్ఎస్ నాయకులపై దాడులకు తెగబడుతున్నారు. వరుస దాడులతో స్థానికంగా భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. బీఆర్ఎస్ శ్రేణులు ఎంత సంయమనం పాటిస్తున్నా రెచ్చగొట్టే ధోరణిని ప్రదర్శిస్తున్నారు. తాజాగా గురువారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో బీఆర్ఎస్ నాయకుడు, కొల్లాపూర్ సింగిల్ విండో వైస్ చైర్మన్ హుజూర్ శ్రీనివాస్ యాదవ్ వాహనంపై మాజీ మంత్రి, కొల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు వర్గీయులు దాడి చేశారు. హుజూర్ శ్రీనివాస్‌యాదవ్.. తన స్వగ్రామమైన మొలచింతపల్లికి వెళ్తుండగా.. కాంగ్రెస్ నాయకులు బైక్‌లపై వెంబడించి వాహనంపై దాడి చేశారు. సమాచారం అందుకున్న కొల్లాపూర్ సీఐ యాలాద్రి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్తుండగా మార్గమధ్యంలో అంజనగిరి సమీపంలో కాంగ్రెస్ మూకలు తాగిన మైకంలో పోలీస్ వాహనంపైనా రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో పోలీసు వాహనం అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సీఐ యాలాద్రి త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. తనపై కాంగ్రెస్ నేతలు దాడికి పాల్పడ్డారని బాధితుడు శ్రీనివాస్‌యాదవ్ అదే రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు విధులకు ఆటంకం కలిగించిన కాంగ్రెస్ నాయకులపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. దాడిలో తమ పార్టీ కార్యకర్తలు లేరని, బనాయించిన కేసులను ఎత్తివేయాలని బుకాయిస్తూ శుక్రవారం సాయంత్రం జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ పోలీస్ స్టేషన్ ఎదుట రెండు గంటలపాటు ధర్నా చేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.


బీఆర్ఎస్ నకిరేకల్‌అభ్యర్థి చిరుమర్తి లింగయ్య రథంపై ఉన్న స్టిక్కర్‌ను చింపివేసిన కాంగ్రెస్ కార్యకర్తలు

### నకిరేకల్‌లో వీరేశం అనుచరుల దాష్టీకం

నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గంలో రోజురోజుకూ కాంగ్రెస్ నాయకుల బెదిరింపులు మితిమీరుతున్నాయి. నిన్న బీఆర్ఎస్ కార్యకర్తపై దాడి ఘటన మరువకముందే శుక్రవారం మరో దాష్టీకం జరిగింది. బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య ప్రచార రథంపై, డ్రైవర్‌పై కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం అనుచరులు దాడికి పాల్పడ్డారు. బాధిత డ్రైవర్ ఎస్‌కే ఖలీల్ తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ పట్టణంలోని పలు వార్డుల్లో శుక్రవారం బీఆర్ఎస్ ప్రచార రథాన్ని తిప్పుతూ బైపాస్ పద్మానగర్ వైపు వెళ్తుండగా దాదాపు 20 మందికి పైగా కాంగ్రెస్ నాయకులు వచ్చి అడ్డుకున్నారు. 'ఈ రోజు మా వీరేశమన్న కాంగ్రెస్ మీటింగ్ ఉంది. కనపడ్తలే కొడకా.. బీఆర్ఎస్ రథాన్ని రోడ్ల మీద తిప్పితే తొక్కి సంపుతం' అంటూ దూషిస్తూ పిడిగుద్దులతో దాడి చేశారు. ప్రచార రథం ముందుభాగంలో ఉన్న గ్లాసును పగులగొట్టారు. వెనుకభాగంలో ఉన్న మంత్రి కేటీఆర్, చిరుమర్తి లింగయ్య ఫ్లెక్సీలు, స్టిక్కర్లను చింపివేశారు. కారు స్టీరింగ్‌ను విరగ్గొట్టారు. కాంగ్రెస్ కార్యకర్త ఒకరు రాయితో దాడి చేయబోగా.. మరో కార్యకర్త అడ్డుకున్నాడని ఖలీల్ తెలిపారు. దాదాపు అరగంటసేపు భయభ్రాంతులకు గురి చేశారని చెప్పారు.

## ఆర్ఎస్ఎస్ కార్యకర్తకు రాహుల్ ప్రచారమా?

- మండిపడిన మాజీ కాంగ్రెస్ నేతలు
- సభ రద్దు చేసుకోవాలని వినతి


మీడియాతో మాట్లాడుతున్న సాజిద్‌ఖాన్

ఆదిలాబాద్, నవంబర్ 24(నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్త కంది శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ అగ్రనేత ఎలా ప్రచారం చేస్తారని ఆదిలాబాద్ డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ప్రశ్నించారు. శుక్రవారం ఆదిలాబాద్‌లో టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, సీనియర్ నాయకుడు సంజీవరెడ్డితో కలిసి సాజిత్‌ఖాన్ మీడియాతో మాట్లాడారు. పార్టీ జెండా మోసిన వారికి, ఏఐసీసీ, పీసీసీ కార్యక్రమాలు విజయవంతం చేసిన వారికి అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు ఇంటికి పంపుతామని, దేశంలో ఆర్ఎస్ఎస్‌తో కొట్లాడుతున్న వ్యక్తిని తాను ఒక్కడినేనని, ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్నవారికి, ప్యారాచ్యూట్‌లకు టికెట్లు ఇవ్వబోమని పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆదిలాబాద్ టికెట్ విషయంలో పార్టీ అగ్రనేత మాటలు ఏమయ్యాయని, ఆర్ఎస్ఎస్ కార్యకర్తకు టికెట్ ఎలా ఇస్తారని? కాంగ్రెస్ సిద్ధాంతాలను ఎందుకు మంట గలిపారని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్ఠానం ఎంతమంది ముస్లింలకు టికెట్లు ఇచ్చిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని ముస్లింలు కోరుకుంటున్నారని అలాంటి నాయకుడు ఆర్ఎస్ఎస్ కార్యకర్త తరపున ఎలా ప్రచారం చేస్తారో అగ్రనేత ఆలోచించుకొని, వెంటనే ఆదిలాబాద్ ప్రచారాన్ని రద్దు చేసుకోవాలని కోరారు.

## కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో అపశ్రుతి

అమీన్‌పూర్, నవంబర్ 24: కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో భాగంగా కార్యకర్తలు అత్యుత్సాహంతో టపాకాయలు పేల్చడంతో అపశ్రుతి చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేటలో కాంగ్రెస్ అభ్యర్థి కాట శ్రీనివాస్ గౌడకు మద్దతుగా పార్టీ కార్యకర్తలు శుక్రవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. కొందరు కార్యకర్తలు టపాకాయలు పేల్చగా వాటి మిరుగులు అక్కడే ఉన్న ఎలక్ట్రికల్ షాప్‌లో పడటంతో మంటలు చెలరేగి భవనం పూర్తిగా దగ్ధమైంది. దీనిపై స్థానికులు, షాప్ యజమాని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

## హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ అధికారిగా స్నేహజ



హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 24 ( నమస్తే తెలంగాణ ) : హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ అధికారిగా జొన్నలగడ్డ స్నేహజ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెకు శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన స్నేహజ 2016 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందినవారు. గతంలో బీజింగ్‌లో ఇండియా ఎంబసీ సెకండ్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టారు. బంగ్లాదేశ్‌లో అండర్ సెక్రటరీగా, మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టర్నల్ ఎఫైర్స్ విజిలెన్స్ డివిజన్‌లోనూ విధులు నిర్వర్తించారు. చార్టెడ్ అకౌంటెంట్‌గానూ పనిచేశారు. ఇప్పటివరకు హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ అధికారిగా ఉన్న దాసరి బాలయ్య.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ అడిషనల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించనున్నారు.

## గంటలోనే శ్రీవారి దర్శన ఫిబ్రవరి టికెట్లు పూర్తి

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ) : తిరుమల శ్రీవారిని ఫిబ్రవరిలో దర్శించుకొనేందుకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేసిన రూ.300 ప్రత్యేక ప్రవేశ టికెట్లు గంటల్లోపే పూర్తయ్యాయి. ప్రతి నెలవారీ టికెట్ల కోటాను టీటీడీ 24, 15న విడుదల చేస్తున్నది. ఇందులో భాగంగా ఫిబ్రవరి కోటాను దక్కించుకొనేందుకు భక్తులు పోటాపోటీ పడ్డారు. చాలా సేపు సర్వర్ బిజీ రావడంతో కొందరు భక్తులు దర్శన టికెట్ల కోసం ఆన్‌లైన్‌లో కుస్తీ పడ్డారు. మధ్యాహ్నం 3 గంటలకు వసతి గదుల బుకింగ్ కూడా అరగంటలోనే పూర్తయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు బస చేసేందుకు కొండపై ఉన్న వసతి గదులతో పాటు తిరుపతిలోని వసతి గృహాల స్లాట్‌ను విడుదల చేసింది.


జగిత్యాల జిల్లా మల్యాలలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్. చిత్రంలో అభ్యర్థి సుంకె

## కర్ణాటక పెత్తనం మనకు అవసరమా?

- అక్కడ 5 గ్యారెంటీలకే దిక్కులేదు
- తెలంగాణలో ఆరు అమలు చేస్తరా?
- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

మల్యాల, నవంబర్ 24: 'తెలంగాణకు పొరుగు రాష్ట్రమైన కర్ణాటక నాయకుల పెత్తనం అవసరమా? ఎన్నికల ప్రచారంలో వారి హంగామా ఏంది? అటు ఢిల్లీ గులాంలు.. ఇటు వీళ్లు.. అక్కడ ఐదు గ్యారెంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక చేతులెత్తేసినోళ్లు.. ఇక్కడ ఆరు గ్యారెంటీలు ఎలా అమలు చేస్తరో ఆలోచించాలి' అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ ప్రజలకు సూచించారు. శుక్రవారం సాయంత్రం మల్యాలలో ఎమ్మెల్సీ ఎల్ రమణ, చొప్పదండి అభ్యర్థి సుంకె రవిశంకర్‌తో కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ 20 రిజర్వాయర్లను నిర్మించి సాగునీటి నీటి కొరతను తీర్చినట్టు చెప్పారు. విద్యుత్తు ఉత్పాదక కేంద్రాలు ఏర్పాటు చేసి మిగులు విద్యుత్తు రాష్ట్రంగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్‌ను, చొప్పదండి అభ్యర్థిగా రవిశంకర్‌ను గెలిపించాలని కోరారు.

### బాబు బెయిల్ పిటిషన్‌పై విచారణ 29కి వాయిదా

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్ (ఐఆర్ఆర్) కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిగింది. సీఐడీ తరపు లాయర్ల అభ్యర్థనతో రాష్ట్ర హైకోర్టు విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. కేసులో తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు చంద్రబాబుపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించింది. మరోవైపు ఉచిత ఇసుక కేసులో చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను కూడా ఈ నెల 30కి కోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు చర్యలు తీసుకోవద్దని స్పష్టంచేసింది. లిక్కర్ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై కూడా వాదనలు పూర్తికాగా.. పిటిషనర్ తరపున మౌకిక వాదనలను రాతపూర్వకంగా కోర్టు ముందు ఉంచాలని పిటిషనర్లకు జడ్జి సూచించారు. ఈ బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

## మోదీ ఏ ముఖం పెట్టుకొని నిర్మల్ వస్తున్నావ్?

- ఇక్కడి అభివృద్ధి పట్టదా?
- ప్రశ్నించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 24 : ఏ ముఖం పెట్టుకొని ప్రధాని మోదీ ఆదివారం నిర్మల్ జిల్లాకు వస్తున్నారని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం అల్లోల ఎన్నికల ప్రచారం నిర్వహించిన సందర్భంగా నిర్మల్‌కు వస్తున్న మోదీకి పలు ప్రశ్నలు సంధించారు. నిర్మల్ నియోజకవర్గ అభివృద్ధికి రూపాయి అయినా ఖర్చు చేశారా? బీజేపీ వల్ల పైసా లాభం అయిందా? నిర్మల్‌కు రైల్వే లైన్ ఏమైంది? నవోదయ స్కూల్ ఏమైంది? దక్షిణ భారత దేశంలో ఉన్న ఏకైక సరస్వతీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి ప్రసాద్ స్కీం కింద నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు పంపితే బుట్టదాఖలు చేసిన మాట వాస్తవం కాదా? ప్రశ్నించారు. ఓట్ల కోసం కాకుండా నిర్మల్ అభివృద్ధి పనుల శంకుస్థాపన చేయడానికి వస్తే ఘనంగా స్వాగతం పలికే వారిమని మంత్రి పేర్కొన్నారు.

## కర్ణాటకలో చేయలేనోళ్లు ఇక్కడ చేస్తారా?

- కాంగ్రెస్ గ్యారెంటీలు మోసమే
- మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

కోస్గి, నవంబర్ 24 : కర్ణాటకలో లేని గ్యారెంటీలను కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఎలా అమలు చేస్తుందని భూగర్భ జల వనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ప్రశ్నించారు. నారాయణపేట జిల్లా కోస్గి మండల కేంద్రంలో ఎమ్మెల్యే, కొడంగల్ బీఆర్ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా 24 గంటల కరెంట్, రైతుబంధు, రైతుబీమా ఇస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను నమ్మితే మోసపోతామని అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఓటమి భయంతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు. బీఆర్ఎస్ సర్కారు గతంలో ఇచ్చిన హామీలనే కాకుండా.. ఇవ్వని వాటిని కూడా నెరవేర్చిందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని కొనియాడారు.


వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి


